సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 5 । డిసెంబర్ । 2024



వెయ్యేళ్ల కాలిబాట!

అదివో..అల్లదివో అంటూ .. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమల ఏడు కొండలను ఎక్కిన కాలిబాట అది.
-8లో



ప్రశాంతంగా రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి.
-8లో

గరిష్టం/కనిష్టం
28.2/25.0

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.0 – 28.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.24 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి పీఆర్ సిబ్బందికి శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్: స్థానికీకరణ–సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జెడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఈనెల 5, 6 తేదీలలో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఈఈ, పీఆర్ అండ్ ఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓ, ఏఈలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు మండలాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల లైన్ డిపార్టుమెంటు ఉద్యోగులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఉంటుందని వివరించారు.

కడప మీదుగా కొట్టాయంకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం కడపమీదుగా కొట్టాయంకు ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07151 నెంబరుగల రైలు జనవరి 2, 9, 16, 23వ తేదీలలో కాచిగూడ నుంచి కొట్టాయంకు నడుస్తుందన్నారు. 07152 నెంబరుగల రైలు కొట్టాయం నుంచి కాచిగూడకు జనవరి 3, 10, 17, 24 తేదీలలో నడుస్తుందన్నారు. ఈ రైలు కాచిగూడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల్, కర్నూలు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూరు, పాలక్కడ్, త్రిశూర్, ఎర్నాకులం మీదుగా కొట్టాయం చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా సర్వేక్షణ్ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన సామర్థ్యాలను అంచనా వేసే కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రత్యేకంగా నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 139 పరీక్షా కేంద్రాలలో 3415 మంది విద్యార్థులు హాజరయ్యారు. సంబంధిత పరీక్షా కేంద్రాలను డీఈఓ మీనాక్షి తనిఖీ చేశారు. డీసీఈబీ సెక్రటరీ విజయ్‌భాస్కర్ రెడ్డి, డిస్ట్రిక్ మాస్టర్స్ ట్రైనర్స్ ఖాసింఖాన్, వెంకటేశ్వరరెడ్డిలు పరీక్షలను పర్యవేక్షించారు.

వదలనంటోన్న వాన

- నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలు
- బుధవారం పలు మండలాల్లో జోరువాన
- కలసపాడులో అత్యధిక వర్షపాతం
- వరిధాన్యం ఆరక ఆందోళనలో అన్నదాతలు
- ఆరుతడి పంటల రైతులలోను గుబులు
- కడపలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- వర్షం నీటితో నిండిన బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు



ప్రొద్దుటూరులో జలమయమైన రహదారిలో వాహనదారుల ఇక్కట్లు

కడప అగ్రికల్చర్: ఫెంగల్ తుపాన్‌తో జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. జిల్లాలో నాలుగు రోజుల నుంచి ఆకాశమంతా మేఘావృతమై ఉండటంతో పాటు పలు మండలాల్లో ఎప్పుడు పడితే అప్పుడు వర్షం కురుస్తోంది. బుధవారం సాయంత్రం ఉన్నట్లుండి దాదాపు జిల్లావ్యాప్తంగా చాలా మండలాల్లో ఉరుములతో కూడిన వర్షం దంచి కొట్టింది. కడప నగరంలో గంటకుపైగా భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలో వర్షం నీరు నిలిచి జనాలు నానా అవస్థలు పడ్డారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షం నీరంతా నిలిచి చెరువును తలపించింది. దీంతోపాటు బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్లపై వర్షం నీటి ప్రవాహంతో పాదచారులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- జిల్లాలో కలసపాడు మండలంలో కురిసిన భారీ వర్షంతో వరితోపాటు పలు ఆరుతడి పంటలన్నీ నీటి మునిగాయి. అలాగే కమలాపురం మండలం జంగంపల్లికు చెందిన రైతు రాఘవకు చెందిన గేదెపై పిడుగుపడి మృతి చెందింది. రోజులాగా సాధారణంగా పడుతుందనుకున్న వర్షం ఉన్నట్లుండి పెద్దగా పడడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పలువురు రైతులు వాపోతున్నారు. పలు చోట్ల ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆవేదనలో ఉన్నారు.

బద్వేల్ డివిజన్‌లో...

జిల్లాలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేల్ డివిజన్ పరిధి కలసపాడులో అత్యధికంగా 30.4 ఎంఎం వర్షం కురిసింది. అలాగే కాశినాయనలో 24.2 ఎంఎం, గోపవరంలో 20.2 , పోరుమామిళ్లలో 15.2 , వేములలో 6 , ముద్దనూరులో 5.2 , బికోడూరులో 2.8 , బద్వేల్‌లో 2.6 , కొండాపురంలో 2.4 , సింహాద్రిపురం, ఎర్రగుంట్ల, బిమఠంలలో 1.2 , తొండూరు 1 ఎంఎం వర్షం కురిసింది.



కలసపాడులో వర్షంతో నీట మునిగిన మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు



కడప నగరంలో జలమయమైన ఆర్టీసీ బస్టాండు



కమలాపురంలో పిడుగు పడడంతో మృతి చెందిన గేదె

▸▸ పంటలకు తీవ్ర నష్టం



ప్రొద్దుటూరులో దెబ్బతిన్న వరి పంట

తుపాన్ కారణంగా మంగళవారంతోపాటు బుధవారం సాయంత్రం వర్షం కురవడంతో వరి రైతులతోపాటు ఆరుతడి పంటల రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రెండు రోజులలో బద్వేల్ డివిజన్‌లోని కాశినాయన, కలసపాడు, గోపవరం, పోరుమామిళ్లలో అధిక వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో కలసపాడు మండలంతో పాటు పలు మండలాల్లోని గ్రామాల్లో వరితోపాటు ఆరుతడి పంటలైన మినుము, మిరప, ఉల్లి పంటలు నీట మునిగాయి.




చింతకొమ్మదిన్నెలో దెబ్బతిన్న వరి పంట పరిశీలిస్తున్న అధికారులు

- తుపాన్ ప్రభావం రెండు మూడు రోజులకు తగ్గుతుందిలే అని చాలామంది రైతులు వరి కోతలకు సిద్ధంగా ఉన్న వరిపంటను కోయకుండా వాయిదా వేసుకున్నారు. అయితే బుధవారం కురిసిన భారీ వర్షం పెద్ద నష్టం తెచ్చిపెట్టింది. పలు మండలాలలో వరిపంట నేలకొరిగిందని పలువురు రైతులు వాపోయారు. వరి కోతలు చేసుకున్న రైతులు మాత్రం వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది రైతులు ఎక్కడ ఆరబెట్టుకోవాలో తెలియక పొలాల్లోనే పట్టలు కప్పి ఉంచుకున్నారు. కొంత మంది రైతులు జాతీయ రహదారులు, మిట్ట ప్రాంతాల్లో, కల్లాల్లో వరిధాన్యాన్ని పట్టలు కప్పి ఉంచుకున్నారు. ఈ చిత్తడి కారణంగా వరి ధాన్యం మొలక వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరం

- చేతులెత్తే పద్ధతి భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధం
- హైకోర్టులో రిట్ పిటీషన్ల దాఖలు



సాక్షి ప్రతినిధి కడప: సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో బెల్లన జగన్నాథం, చిరుమామిళ్ల శ్రీనివాసరావులు వేర్వేరుగా రిట్ పిటీషన్లు దాఖలు చేశారు. మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఎన్నికల నిర్వహణ) రూల్స్, 2018 రాజ్యాంగంలోని ఆర్టికల్–19 (1)(ఎ) ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కల్పించేవిగా ఉన్నాయన్నారు. ఎన్నికలు నిర్వహిస్తున్న ప్రక్రియ ఏకపక్షమైనదిగా ఉందంటూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లు ఏకాభిప్రాయంతో నీటి సంఘాలను ఎన్నుకోవడం, బ్యాలెట్ పద్ధతి, చేతులెత్తే పద్ధతిలో ఉన్నాయన్నారు. ఇందులో చేతులెత్తే పద్ధతి వల్ల రాజ్యాంగం ప్రసాదించిన రహస్య ఓటింగ్ విధానానికి పూర్తి విఘాతాన్ని కలిగిస్తుందన్నారు. ఇందువల్ల పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి ఓటర్లకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందన్నారు. 2020 నాటి లక్ష్మిసింగ్, ఇతరులు వర్సెస్ రేఖాసింగ్, ఇతరులు కేసులో రహస్య ఓటింగ్ అనేది రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్యంలో కీలకమైనదంటూ అపెక్స్ కోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయాన్ని పిటీషనర్లు పేర్కొన్నారు. ఈ పిటీషన్లు రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్, రవి చీమలపాటి న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ కేసు లిస్టు కానుంది. ప్రతివాదిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం తరుపు ఉన్న అడ్వకేట్ జనరల్‌కు వాదనలు వినిపించేందుకు విషయాన్ని పంపారు.

ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరిలో అవగాహన పెరగాలి



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: సమాజంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచాలని అడిషనల్ డీఎంఈ, కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. ఏఆర్‌టీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కడపలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏఆర్‌టీ విభాగంలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు అన్నిరకాల రక్తపరీక్షలు, మందులు ఇస్తున్నామని, ఈ మందులు చాలా బాగా పనిచేస్తున్నాయన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రమాదేవి , ఏఆర్‌టీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల సమస్యలు పట్టవా..?

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



వికలాంగుల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు పంటలన్నీ దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని తన నివాసంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారి సమస్యలను సీఎం చంద్రబాబు గాలికి వదిలేశారన్నారు. అన్నదాతల సమస్యలను గాలికి వదిలేసి కబుర్లు చెబుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

ఎంపీకి సన్మానం: సింహాద్రిపురం మండలం హిమకుంట్ల ఎస్సీ కాలనీ వాసులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని సన్మానించారు. గత నెల 28వ తేదీన అరకొర కరెంటు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్సీ కాలనీకి పూర్తిగా కరెంటు సరఫరా తొలగించారు. దీంతో కాలనీ ప్రజలు టీడీపీ, బీజేపీ నాయకులను సంప్రదించారు. వారు ఎటువంటి సహాయ సహకారాలు అందించకపోవడంతో.. వైఎస్సార్‌సీపీ నాయకుడు కిశోర్ రెడ్డిని ఎస్సీ కాలనీ ప్రజలు సంప్రదించారు. దీంతో ఆయన ఈ విషయాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందించి ఎస్సీ కాలనీలో ఉన్న కరెంటు బిల్లులను చెల్లించడం తోపాటు ఎస్సీలకు నూతన మీటర్లను ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీ వాసులు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసం చేరుకుని బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. వైఎస్ కుటుంబానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలియజేశారు.

త్వరలో స్మార్ట్ డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: త్వరలో వాహనదారులకు కొత్త స్మార్ట్ డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను అందిస్తున్నట్లు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన సాక్షితో మాట్లాడారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో దీర్ఘ కాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఒక చక్కటి అవకాశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ – రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్‌తోపాటు జేసీ అదితిసింగ్ హాజరయ్యారు. మంత్రి వీసీ ముగిశాక కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆ మేరకు జిల్లాలో ప్రణాళిక ప్రకారం నిర్ణయించిన తేదీ సమయాల్లో, నిర్దేశించిన గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలన్నారు. సదస్సులపై ముందుగా గ్రామాలలో అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

రెవెన్యూ సదస్సులలో మ్యూటేషన్లు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు 22(ఎ) దుర్వినియోగం మొదలగు అంశాలపై గ్రామస్తుల నుండి అర్జీలను స్వీకరించాలన్నారు. రెవెన్యూ సదస్సు నిర్వహించిన రోజు నుండి 40 రోజుల్లోగా విచారణకు వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు జారీ చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జెడ్‌హెచ్‌డీసీ భూముల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, ఎస్డీసీ ఎల్.ఏ. శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

▸▸ గండికోట పర్యాటక అభివృద్ధికి అడుగులు

గండికోట పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో.. జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, సంబంధిత ప్రాజెక్టు ఏజెన్సీతో కలిసి గండికోట పర్యాటక అభివృద్ధిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాంతమైన 'గండికోట పర్యాటక కేంద్రం' భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందన్నారు. ఆ దిశగా ఇప్పటికే గండికోట డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించే విధంగా ప్రత్యేకమైన, సృజనాత్మకమైన నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రజలకు వినోదంతోపాటు వారి భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పోలీసు భద్రతలో భాగంగా 24/7 అందుబాటులో ఉన్న ఒక బోట్ పోస్టు నిర్వహణలో ఉందన్నారు. అనంతరం.. గండికోట పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు రిపోర్టు వివరాలను పీపీటీ ద్వారా కలెక్టర్ పరిశీలించి టూరిజం శాఖ అధికారికి పలు సూచనలు ఇచ్చారు.

క్లుప్తంగా

విష ద్రావణం తాగి యువకుడి ఆత్మహత్య


ఉమామహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

వల్లూరు (చెన్నూరు) : విష ద్రావణం తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంగటి ఉమామహేశ్వర్ రెడ్డి (26) కారు డ్రైవర్‌గా అలాగే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం తెల్లవారుజామున రోజువారి నడకలో భాగంగా బయటకు వెళ్లిన అతను పుష్పగిరి రోడ్డులోని గ్రామ సమీపంలో విషద్రావణం తాగాడు. సీఐ పురుషోత్తం రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుకు గురై మహిళకు తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి : మండలంలోని ఎనుగువారిపల్లె గ్రామానికి చెందిన పేర్ల నాగ పార్వతి (38) అనే మహిళ బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. నాగ పార్వతి రోజు మాదిరిగానే వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా సాయంత్రం ఒక్క సారిగా వర్షంతో పాటు ఉరుములు మెరువులు రావడంతో పిడుగు పడింది. దీంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. 108 వాహనంలో కడపలోని ఆసుపత్రికి తరలించారు.

వెయ్యేళ్ల కాలిబాట!

అదివో.. అల్లదివో అంటూ శ్రీవారిని స్మరిస్తూ.. వేడుకొంటూ అత్యంత భక్తితో రాజంపేట మండలంలోని తాళ్లపాక వాసి పదకవితా పితామహుడు అన్నమాచార్యులు ఏడు కొండలను ఎక్కిన కాలిబాట అది. ఇది వెయ్యేళ్ల కిందటి మాట. ఆహ్లాదకరమైన దట్టమైన అటవీ మార్గంలో శ్రీవారిని దర్శించుకునేందుకు ఆ రోజుల్లో పూర్వీకులు వేల సంఖ్యలో వెళ్లేవారు. అన్నమయ్య వారసులు సైతం ఈ మార్గంలో కొండకు నడిచి వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టీటీడీ అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి నడుం బిగించింది. ప్రస్తుత ప్రభుత్వం అన్నమయ్య కాలిబాటను అటకెక్కించింది.

- నేటికీ అదే బాటలో వెంకన్న భక్తుల నడక
- కాలిబాట ఆద్యంతం ఆహ్లాదకరం, ఆధ్యాత్మికం
- కాలిబాట అభివృద్ధిని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం

రాజంపేట : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిపై 32వేల కీర్తనలు రాసి ఆలపించి, మహాభక్తునిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచి వెళ్లిన కాలిబాటలో వెళ్లడం మహాభాగ్యంగా శ్రీవారి భక్తులు భావిస్తున్నారు. ఆ కాలిబాటలో తిరుమల కొండకు చేరుకుంటున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఉన్నప్పుడు నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అప్పట్లో వైఎస్సార్ స్పందించి ఈ కాలిబాటను పరిశీలించాలని టీటీడీకి ఆదేశాలు కూడా జారీ చేశారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి ఆమోదం తెలిపింది. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో నిమగ్నమైన సంగతి తెలిసిందే. కూటమి సర్కారులో అన్నమయ్య కాలిబాటను అటకెక్కించేశారు. ఆ దిశగా చర్యలేవీ కనిపించలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు.


శేషాచలం అడవిలో అన్నమయ్య కాలిబాట

కాలిబాట స్వరూపం ఇలా..

- మామండూరు–బాలపల్లె మధ్య స్వామి పాదాల నుంచి తిరుమల కాలిబాట ప్రారంభమవుతుంది. పక్షుల కిలకిలలు, సెలయేళ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ కొండకు చేరుకోవచ్చు.
- అవ్వాతాత గుట్టలు, శుక్రవారం బండలు, పురాతన సత్రాలు, ఎర్రిగుంటలు, ఈతకాయల మండపం నుంచి గోగర్భతీర్థం(తిరుమల) చేరుకుంటారు.
- ఈ కాలిబాట సుమారు 14 కిలోమీటర్ల దూరం మేర పూర్తిగా దట్టమైన అడవిలో ఉంటుంది.
- పాదాలు, అక్కడి కోనేరు, సత్రాలు కాలగర్భంలో కలిసి పోయాయి.

కాలిబాటకు వెయ్యేళ్లు..

రాజంపేట మండలంలోని తాళ్లపాక నుంచి అన్నమయ్య నడిచి వెళ్లిన కాలిబాట నేడు శిథిలమైంది. వెయ్యేళ్ల క్రితం ఉన్న రహదారి అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి సారించింది. ఈ బాట ద్వారా వెయ్యేళ్ల క్రితం నుంచి భక్తులు గోవిందనామ స్మరణలు చేసుకుంటూ శ్రీవారి సన్నిధికి చేరుకుంటూనే ఉన్నారు.


108 అడుగుల అన్నమయ్య విగ్రహం

ఉత్తర, దక్షిణ భారతీయులకు అనుకూలం..

పూర్వం తిరుమలకు ఈ దారి గుండా అధిక సంఖ్యలో శ్రీవారి భక్తులు వెళ్లేవారు. అయితే తిరుపతి నుంచి ఏడుకొండలు మీదుగా తిరుమల చేరుకోవడం నేడు పరిపాటిగా మారింది. ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశంతోపాటు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు తిరుపతికి వెళ్లకుండానే నేరుగా అన్నమయ్య కాలిబాట ద్వారా స్వామి సన్నిధికి చేరుకోగలరు. స్వామి సన్నిధికి చేరుకునే పుణ్య పవిత్రమైన మార్గంగా కాలిబాట ప్రాచుర్యం పెరుగుతోంది.

అటవీప్రాంతం	శేషాచలం
తొలినడక	అన్నమాచార్యుడు
కాలిబాట ప్రారంభం	మామండూరు - బాలపల్లె మధ్య
చరిత్ర	వెయ్యేళ్లు
దూరం	23 కిలోమీటర్లు
అనుకూలం	ఉత్తర, దక్షిణ భారతీయులు, తెలంగాణ, రాయలసీమ వాసులకు

6న ఆకేపాటి పాదయాత్ర..

ఈనెల 6న శుక్రవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి 22వ సారి వేలాది మందితో అన్నమయ్య కాలిబాటలో పాదయాత్ర చేపట్టి ఏడు కొండలు చేరుకోనున్నారు. ఈయనతోపాటు అనేక మంది గోవిందమాలలు ధరించి వెళ్లనున్నారు. ఉదయం ఆకేపాడు ఆలయాల సముదాయంలో శ్రీవారి కళ్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం 2 గంటలకు తిరుమల మహాపాదయాత్ర ప్రారంభవుతుంది.

అన్నమయ్య కాలిబాటలో నడిచి వెళ్లడం మహాభాగ్యం



పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచి వెళ్లిన కాలిబాటలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవడం మహాభాగ్యం. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడి ఆధ్వర్యంలో ఏటా భక్తులు కాలిబాటలో శ్రీవారిని దర్శించుకుంటున్నారు. కాలిబాట అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి.

- భూమన శివశంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

మూడవ ఘాట్‌రోడ్డుగా అభివృద్ధి చేయాలి



అన్నమయ్య కాలిబాట అభివృద్ధిను అభివృద్ధి చేయాలని తన పాదయాత్రల ద్వారా విస్తృత ప్రచారం చేసి, అభివృద్ధికి టీటీడీ శ్రీకారం చుట్టేలా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎంతగానో కృషి చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో అన్నమయ్య కాలిబాట అభివృద్ధి దిశగా అడుగులు వేశారు. ఈ కాలిబాటను అభివృద్ధి చేయడం వల్ల తిరుమల మూడవ ఘాట్‌రోడ్డుగా దోహదపడుతుంది.

-గడికోట వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాజంపేట

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత ఆరు నెలల్లో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఇది ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరులో స్థానిక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచేందుకు జగన్ ప్రభుత్వం ముందడుగు వేస్తే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నిరక్షరాస్యతను పెంచే విధంగా ఉన్నాయని విమర్శించారు. పనికి వెళ్లే పిల్లలను బడికి పంపడం కోసం అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని ఈ ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని చెప్పి దాని ఊసే లేకుండా చేశారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారన్నారు. ఈ ప్రభుత్వం ఆ పథకానికి సంబంధించి రూ.లక్ష కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఉన్నత విద్యకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూపాయి కూడా చెల్లించలేదన్నారు. జగన్ ప్రభుత్వంలో మంచి మెనూతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేవారని,ఇప్పుడు నాసిరకమైన భోజనం పెడుతున్నారన్నారు. అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తామని చెప్పారే కానీ, నాణ్యమైన విద్యను అందిస్తామని ఎందుకు చెప్పలేదన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించలేదన్నారు. ప్రభుత్వ విధానం మారకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఈనాడు, ఆంధ్రజ్యోతిలో రోజూ జగన్‌పైనే కథనాలు

ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ప్రజా సమస్యలను, ప్రస్తావించాల్సిన అంశాలను గాలికొదిలేసి రోజూ జగన్‌పై బురద చల్లడమే పనిగా పెట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు విమర్శించారు. జగన్, షర్మిలమ్మ ఆస్తుల పంపకం విషయం ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంజికుంట ఆంజనేయులు, పోసా భాస్కర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు

పోలింగ్ వివరాలు		
పోలింగ్‌బూత్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
నందలూరు	418	214
కడప	374	211
కోడూరు	256	107
ఎర్రగుంట్ల	473	222
కొండాపురం	200	109
ప్రొద్దుటూరు	144	117


కడప పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వేచి ఉన్న కార్మికులు

రాజంపేట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. డివిజనల్ ప్రిసైడింగ్ ఆఫీసర్ సుధాకర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ జయశంకర్ చౌహాన్‌లు పోలింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. డివిజన్ వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉమ్మడి జిల్లా పరిధిలో రైల్వేకోడూరు, నందలూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాల్లో ఆయా పరిధిలో ఓటు కలిగిన ఉద్యోగ, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వేరక్షక దళాలు, ప్రభుత్వ రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తును చేపట్టారు. డివిజన్ వ్యాప్తంగా 185 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా డివిజన్ పరిధిలో 14, 453 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

6వతేదీలోపు పోస్టల్ బ్యాలెట్

వివిధ రైల్వే స్టేషన్‌లలో ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న సిబ్బందితోపాటు రన్నింగ్‌స్టాఫ్, టిక్కెట్ చెకింగ్, రక్షణ విభాగం సిబ్బంది ఈనెల 6వతేదీలోపు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు ఆదేశించారు. 6వతేదీ సాయంత్రంలోపు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది.

తొలిరోజు పోటాపోటీగా కార్మిక నేతల ఆరాటం

పోలింగ్ బూత్‌ల వద్ద తొలిరోజు వివిధ కార్మిక సంఘాల నేతలు తమకు అనుకూలంగా ఓటు అభ్యర్థన కోసం ఆరాటపడ్డారు. ప్రధానంగా మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ కార్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి.

పిడుగు పడి పాడి గేదె మృతి

కమలాపురం : మండల పరిధిలోని జంగంపల్లెలో పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది. బుధవారం సాయంత్రం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కుస్తున్న సమయంలో భారీ శబ్దాలతో పిడుగు పడి జంగం పల్లెలో అనిమెల రాఘవకు చెందిన పాడి గేదె మృతి చెందింది. తాటిచెట్టుకు గేదెను కట్టి ఉండగా పిడుగు ఆ చెట్టుపై పడింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం 5 లీటర్లు, సాయంత్రం 4లీటర్లు పాలు ఇస్తుండేదని, రూ.1.20 లక్షలు అవుతుందని, ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు రాఘవ ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా పశు వైద్య క్షేత్ర స్థాయి సిబ్బంది రుక్సానా ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గేదెను పరిశీలించారు.

డీఈఓ వైఖరి సరికాదు



డీఈఓ కార్యాలయం వద్ద నిరస తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : అపార్ పూర్తి చేయలేదనే కారణంగా జిల్లాలోని వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న 829 మంది హెడ్మాస్టర్లకు డీఈఓ షోకాజ్ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు విమర్శించారు. డీఈఓ చర్యకు నిసరనగా బుధవారం సాయంత్రం యూటీఎఫ్ నాయకులు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే దాదాపు 80 శాతం మంది విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేశారని తెలిపారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో మరో 20 శాతం విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. అయితే జిల్లా విద్యాశాఖ అధికారి మాత్రం అపార్ నమోదులో జాప్యం జరుగుతున్నదనే సాకుతో జిల్లా వ్యాప్తంగా వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న 829 మందికి షోకాజు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. తక్షణమే షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, సి.వి.రమణ, నాయకులు బత్తుల చంద్రశేఖర్, గోపీనాథ్, రామ కేశవ, బాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన హుస్సేన్ వలీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో నివాసం ఉండే షేక్ హుస్సేన్ వలీ (50) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. న్యూకాలనీకి చెందిన షేక్ హుస్సేన్ వలీ బుధవారం తెల్లవారుజామున ముద్దనూరు రోడ్డులోని టీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న టీ బంకులో టీ తాగి తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వెంటనే స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు.

జ్వరంతో చిన్నారి మృతి

పుల్లంపేట : పుల్లంపేట మండలం, చెర్లోపల్లి అరుంధతివాడ గ్రామానికి చెందిన వెంకటేష్, సాయితేజశ్రీ దంపతుల కుమార్తె దేవాన్షి (15 నెలలు) బాలిక జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా రక్తంలో ఇన్ఫెక్షన్ ఉందని డాక్టర్ చికిత్స అందించినా జ్వరం తగ్గలేదు. దంతో రాజంపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపించినా ఫలితం లేకపోవడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ముద్దుల కుమార్తె దేవాన్షి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు.

యువకుడి ఆత్మహత్య

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం బాటవారిపల్లెకు చెందిన రాయదుర్గం రామాంజులు (24) అనే యువకుడు ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బాటవారిపల్లెకు చెందిన రామకృష్ణ కుమారుడు రామాంజులు ఇటీవల తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే చిన్నమండెం- సంబేపల్లె సరిహద్దు సమీపంలోని సొంత మామిడితోటలోని పనస చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ పరిశీలించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఐదు నెలల క్రితం వివాహమైంది. దీంతో మృతుని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ


రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని భువనగిరిపల్లె ఆర్చి(రాజంపేట మండలం) వద్ద బుధవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా దేవరపురి తాలూకా ఇబ్రహీంపట్నంకు చెందిన లారీ డ్రైవర్ పరమానంద సిద్దప్ప (35) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పట్టణ సరిహద్దులో ఉన్న భువనగిరిపల్లె ఆర్చి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి, ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొంది. బస్సు డ్రైవర్ లోకేష్‌రెడ్డితోపాటు హైదరాబాదు చందానగర్‌కు చెందిన తనూజ, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ఎం.ప్రవీణ్, సునీల్‌కు గాయాలయ్యాయి. వీరిని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదం సంఘటనతో హైవేలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులను చితకబాదిన అధ్యాపకుడు


వాతలు చూపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దీప్తి జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు అల్లరి చేస్తుండటంతో వాతలు తేలేలా కొట్టడం వివాదాస్పదంగా మారింది. కళాశాలలో బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో స్టడీ అవర్‌లో విద్యార్థులు చదువుకుంటుండగా సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థులు కృపాకుమార్, చిన్నా అల్లరి చేస్తుండటంతో అధ్యాపకుడు శ్రీనివాసులరెడ్డి వారించాడు. అయినా వారి అల్లరి కొనసాగడంతో అధ్యాపకుడు వారిని బెత్తంతో కొట్టడంతో వాతలు పడ్డాయి. ఆ దెబ్బలపై స్ప్రేచేసి మధ్యాహ్నం ఆ విద్యార్థులను ఇంటికి పంపించాడు. విద్యార్థుల దెబ్బలు చూసిన తల్లిదండ్రులు మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కళాశాల వద్దకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. ఇరు వర్గాలకు గొడవ జరగడంతో విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. కళాశాల వద్ద గొడవ జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు ఇరు వర్గాలను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కాగా కృపాకుమార్ తల్లిదండ్రులు అధ్యాపకునిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కళాశాల డైరెక్టర్ బాలసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అల్లరి చేస్తుండటంతో అధ్యాపకుడు మందలించారని, అయితే ఓ విద్యార్థి తిరగబడటంతో బెత్తంతో కొట్టారన్నారు. మరో విద్యార్థి సోదరుడు వచ్చి అల్లరి చేస్తున్నప్పుడు కొట్టడం తప్పుకాదని తమ వాడు చేసింది తప్పే అని చెప్పారన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ రంగంలో నూతన సంస్కరణల పేరుతో రూ. లక్షల కోట్లు విలువచేసే విద్యుత్ సంస్థలను పాలకులు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి విమర్శించారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌లో పలు యూనియన్ల నాయకులు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ మూలంగా ఉద్యోగులకంటే ప్రజలకు ఎక్కువ స్థాయిలో నష్టం కలుగుతుందన్నారు. సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మానందరెడ్డి, లక్ష్మినారాయణ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరణ కోసం అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అదనపు కార్యదర్శి బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాపరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ అధికారులపై లోకాయుక్తకు ఫిర్యాదు

మైదుకూరు : తెలుగు గంగ భూముల ఆక్రమణకు సహకరించిన ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు.

గతంలో తాను తెలుగు గంగ భూముల ఆక్రమణపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశానన్నారు. ఆమేరకు జలవనరుల శాఖ ఈఎన్సీ తెలుగు గంగ ఇంజనీర్లను, భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. అయితే సంబంధిత అధికారులు ఈఎన్సీ ఆదేశాలను ఖాతరు చేయలేదని తెలిపారు. కాగా మైదుకూరు మండలం జీవీ సత్రం ప్రాంతంలో తెలుగు గంగ భూమిని ఆక్రమించి విక్రయించినట్లు ఆ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకునిపై కొద్ది రోజుల కిందట ఆ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. లోకాయుక్త నోటీస్ ఇచ్చినా పట్టించుకోని జలవనరుల శాఖ ఉన్నట్టుండి భూముల ఆక్రమణపై వైఎస్సార్‌సీపీ నాయకునిపై ఫిర్యాదు చేసిందన్నారు. భూముల ఆక్రమణకు సహకరించిన ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలంటే సమస్యలు వస్తాయని భావించి ఆక్రమణదారుడిపై మాత్రమే ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో భూముల ఆక్రమణకు సహకరించిన తెలుగుగంగ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని తాను లోకాయుక్తను కోరినట్టు వివరించారు.